## క్లుప్తంగా

### అయోధ్యకు రామ భక్తులు



అయోధ్యకు వెళుతున్న భక్తులు

గుత్తి: అయోధ్యలో బాల రాముని దర్శనం కోసం జిల్లా నుంచి 195 మంది రామ భక్తులు గుత్తి రైల్వే స్టేషన్ నుంచి ఆదివారం రాత్రి 11.30 గంటల సమయంలో రైల్లో బయలుదేరారు. విజయవాడ నుంచి అయోధ్యకు వేసిన స్పెషల్ ట్రైన్‌లో రామ భక్తులందరూ తరలివెళ్లారు. ఈ సందర్భంగా రైల్వే సీసీఐ హనూక్ కుమార్, ఎస్ఎంఆర్ సురేష్, ఐపీఎఫ్ అనురాగ్ శర్మ తదితరులు భక్తులకు భోజన సదుపాయం కల్పించారు. అనంతరం రైల్వే అధికారులు భక్తులను రైలు ఎక్కించి వీడ్కోలు పలికారు.

### ఆలయ పునః నిర్మాణ పనుల ప్రారంభం

పుట్లూరు: మండలంలోని చింతకుంట కాలభైరవ స్వామి ఆలయ పునః నిర్మాణం కోసం సోమవారం గ్రామస్తులు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని గోడను తొలగించారు. త్వరలో భూమిపూజ చేపట్టి ఆలయ నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

### నివాళి



కేశవాపురంలో ప్రతాప్‌రెడ్డి మృత దేహం వద్ద నివాళులర్పిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

గార్లదిన్నె: మండలంలోని మర్తాడు, కేశవాపురం గ్రామాల్లో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. వివరాలు.. మర్తాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వెంకటరెడ్డి(84) అనారోగ్యంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే కేశవాపురంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రతాప్‌రెడ్డి(67) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆలూరి సాంబశివారెడ్డి ఆయా గ్రామాలకు వెళ్లి మృతదేహాలపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరేంద్ర, ఎంపీపీ వెంకటనారాయణ, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్ రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

### 'బాలోత్సవం'లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం మధుసుదన్‌రావు

గుంతకల్లు: పట్టణంలోని రైల్వే ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు అనంత బాలోత్సవంలో ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ మధుసుదన్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం హైస్కూల్‌లో అభినందన సభకు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 12,13,14వ తేదీల్లో అనంతపురం ఆర్ట్స్ కాలేజీలో జరిగిన అనంత బాలోత్సవంలో తమ స్కూల్‌కు చెందిన దాదాపు 84మంది 24 ఈవెంట్లులో పాల్గొనగా 14 ఈవెంట్లలో ప్రతిభ కనబరిచి 14 బహుమతులను గెలుచుకున్నారన్నారు. అందులో 4 మొదటి బహుమతులు, 2 రెండో బహుతులు, 5 మూడో బహుతులతోపాటు 3 కన్సొలేషన్ బహుమతులున్నాయన్నారు.

### అధ్యాపకులకు అభినందన



డాక్టరేట్ పట్టా అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు అధ్యాపకులు డాక్టరేట్ సాధించినట్లు ప్రిన్సిపాల్ గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కరస్పాండెంట్ కేసీ హరి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కళాశాలకు చెందిన మేనేజ్‌మెంట్ విభాగం అధ్యాపకురాలు పాటిల్ శ్రావణి, వాణిజ్యశాస్త్ర విభాగం అధ్యాపకుడు సీపీ మహేష్‌కుమార్ వివిధ యూనివర్శిటీల నుంచి డాక్టరేట్ (పీహెచ్‌డీ) పట్టా పొందారన్నారు. కార్యక్రమంలో ప్రజా సంబంధాల అధికారి బసెట్టి క్రిష్ణయ్య, అధ్యాపకులు పీ.శ్రీనివాసులు, డి.వెంకటేశ్వర్లు, డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ సుభాషిణి, రఘు పాల్గొన్నారు.

### రెండు కార్ల ఢీ..

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని ట్రాన్స్‌కో కార్యాలయం సమీపంలో ట్రాన్స్‌కో షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వివరాలు.. కర్ణాటకకు చెందిన కొందరు రెండు కార్లలో మంత్రాలయం బయలుదేరారు.అయితే ఆర్ఎస్‌లో ముందు వెళుతున్న ఇన్నోవా కారును వెనుక నుంచి ఐ–20 కారు ఢీ కొంది. ప్రమాదంలో రెండు కార్లు కొద్దిగా ధ్వంసమయ్యాయి. అదృష్టవశాత్తూ ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# వలంటీర్లు.. సంక్షేమ వారధులు

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సమన్వయకర్త వీరాంజనేయులు, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి



వలంటీర్లను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, సమన్వయకర్త వీరాంజనేయులు



కార్యక్రమానికి హాజరైన వలంటీర్లు

శింగనమల: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వలంటీర్లు సంక్షేమ వారధులుగా నిలిచారని, జగనన్న సైనికులు మీరేనని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. సోమవారం శింగనమల వాసవీ కల్యాణ మండపంలో ఎంపీడీఓ బీవీ రమణ ఆధ్యక్షతన వలంటీర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల సిఫారసు మేరకు ఆ పార్టీ వారికి మాత్రమే అందేవని, పేదలకు మొండిచేయి చూపారన్నారు. ఆ ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను కులమత, వర్గ, రాజకీయ ప్రమేయం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ఈ పథకాలను పేద ప్రజలకు నేరుగా అందించి , వలంటీర్ వ్యవస్థకు వన్నె తెచ్చారన్నారు. కరోనా సమయంలో మీసేవలు అమోఘమన్నారు. సన్మానంతో పాటు సేవా మిత్రకు రూ.15 వేలు, సేవారత్నకు రూ.30 వేలు, సేవా వజ్రకు రూ.45 వేలు అందజేస్తున్నామన్నారు. మండలంలో 241 మందిలో ఐదుగురు సేవా రత్న అవార్డులు పొందారని, మిగిలిన వారందరికీ సేవా మిత్ర అవార్డులు అందజేస్తున్నామన్నారు. త్వరలో ఎన్నికలు రాబోతున్నాయని, వలంటీర్లు వారి పరిధిలోని లబ్ధిదారుల వద్దకు వెళ్లి , జగనన్న ప్రభుత్వంలో అందించిన లబ్ధిని వివరించాలన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. కార్యక్రమంలో నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల, డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, సర్పంచులు వెంకట్రాముడు, మండల కోఆప్షన్ మెంబర్ ఆలీ, నాయకులు ఎస్వీ నారాయణ, నాగన్న, బండి లలిత, కళ్యాణి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## సచివాలయాల ఏర్పాటుతో గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు



సలకంచెరువులో సచివాలయాన్ని ప్రారంభించిన జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, సమన్వయకర్త వీరాంజనేయులు, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయాలతో నేరుగా గ్రామీణులకు ప్రభుత్వ సేవలు అందుతున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ , ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఈస్ట్ నరసాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, వ్యవసాయ గోదాము, సలకంచెరువులో గ్రామ సచివాలయాన్ని ఏడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ లిఖిత, నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు , స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి వారు ప్రారంభోత్సవం చేశారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు నేరుగా ప్రభుత్వ సేవలందుతున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ అనేది ఏరాష్ట్రంలోనూ లేదన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయం, ఆర్బీకే, డా.వైఎస్సార్ విలేజ్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీ, పాలువెల్లువ కేంద్రం, వ్యవసాయ గోదాములు ఏర్పాటు చేసి సేవలన్నీ గ్రామాల్లోనే పొందేలా చేశారన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, సర్పంచులు బొమ్మన గోపాలురెడ్డి, ఆది నారాయణ, వైస్ ఎంపీపీ నరసింహులు, ఎంపీటీసీ చిన్న బయ్యన్న, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి, వైస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్వీ నారాయణ, నాయకులు రంగస్వామి, కల్లుమడి కొండయ్య, కోరే రాముడు, నాగన్న, బండి లలిత కళ్యాణి, శ్రీనివాసులు నాయక్ , అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీతోనే రహదారుల అభివృద్ధి



జ్యోతిరావు పూలే (దోనిముక్కల) రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

- దోనిముక్కల రోడ్డు ప్రారంభించిన ఎమ్మెల్యే

గుంతకల్లుటౌన్: వైఎస్సార్‌సీపీతోనే రహదారుల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. వాల్మీకిసర్కిల్ నుంచి దోనిముక్కల వరకు రూ.3.80 కోట్లతో నిర్మించిన సీసీ కమ్ బీటీ రోడ్డును సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఎంతో మంది ఎమ్మెల్యేలు రోడ్డును వేయించకపోగా అభివృద్ధిని అడ్డుకోవాలని చూడటం సిగ్గుచేటన్నారు. దోనిముక్కల రోడ్డులోని జగనన్న లేఅవుట్లలో నివసిస్తున్న ప్రజానీకంతో పాటు ఆ మార్గం వెంబడి ప్రయాణించే చుట్టుపక్కల గ్రామాల ప్రజల రహదారి సమస్య పరిష్కారమైనందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ రోడ్డుకు మహాత్మా జ్యోతిరావు పూలే రోడ్డుగా నామకరణం చేస్తున్నట్లు ఎమ్మెల్యే వైవీఆర్ ప్రకటించారు. అనంతరం కాంట్రాక్టర్ రామాంజుల రెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ శ్రీధర్‌రెడ్డి, ఏఈ సత్యనారాయణను సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యేను కాలనీవాసులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అధ్వాన్నంగా ఉన్న దోనిముక్కల రోడ్డును వేయించి తీరుతామని ఎమ్మెల్యే గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఎట్టకేలకు నెరవేర్చడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, కౌన్సిలర్లు దర్గాచెన్నమ్మ, భాస్కర్, లింగన్న, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, మున్సిపల్ మాజీ చైర్మన్ జింకల రామాంజనేయులు, కోఆప్షన్ సభ్యులు ఫ్లయింగ్ మాబూ, నూర్‌నిజామి, నాయకులు గోవింద్‌నాయక్, దేవేంద్రప్ప, జయరామిరెడ్డి, బొజ్జన్న, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



అభివృద్ధి కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే తాడిపత్రి అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో బాగంగా సోమవారం పట్టణంలోని యల్లనూరు రోడ్డులో నాయకులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సహకారంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపించామన్నారు. గతంలో జేసీ సోదరులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని కేవలం కక్ష సాధింపు చర్యలకు పాల్పడి, నియోజక అభివృద్ధిని విస్మరించారని మండపడ్డారు. అధికారంలో ఉన్నన్నాళ్లూ జేసీ సోదరులు ప్రజలను పీక్కుతిన్నారే కానీ ఏనాడూ ప్రజల బాగోగులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల ముంగిటకు తీసుకొచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు హీరాపురం ఫయాజ్‌బాషా, రఫీ, చిన్న నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు కొనుదుల రమేష్‌రెడ్డి, పేరం స్వర్ణలత, విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కంచం రామ్మోహన్‌రెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఆర్వీ ఓబుళరెడ్డి, వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు మహబుబ్‌బాషా, కోశాధికారి బాబాఫక్రుద్దీన్, పట్టణ కన్వీనర్ జావిద్‌ఖాద్రీ, విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కేశవరెడ్డి, పట్టణాధ్యక్షుడు మనోజ్, నాయకులు గోసు రామేశ్వరరెడ్డి, ఆకుల నాగిరెడ్డి, కొసినేపల్లి నరసింహారెడ్డి, పేరం ప్రతాప్‌రెడ్డి, డీవీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధం సభకు వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు



ఎమ్మెల్యే వైవీఆర్



ఆలూరు సాంబశివారెడ్డి

గుంతకల్లుటౌన్: సార్వత్రిక ఎన్నికలకు పార్టీశ్రేణులను సమాయత్తం చేయడానికి రాప్తాడులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన సిద్ధం భారీ బహిరంగ సభకు గుంతకల్లు నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలివచ్చిన పార్టీశ్రేణులు, ప్రజలందరికీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా లక్షలాది మందితో సిద్ధం సభ జరిగిందన్నారు. సిద్ధం సభ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇదే ఉత్సాహంతో రానున్న ఎన్నికల్లో కష్టపడి పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు.

శింగనమల: రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభకు నియోజకవర్గం నుంచి భారీగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులకు ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. అభిమానులు, కార్యకర్తలు, నాయకుల్లో సీఎం జగన్‌పై అభిమానం రోజురోజుకూ రెట్టింపు అవుతోందన్నారు. అందుకు నిదర్శనం రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభ అన్నారు. సభ విజయవంతం చేయడానికి తరలివచ్చిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. అందరూ సమష్టిగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



పామిడి: ఛత్రపతి శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



తాడిపత్రి : ర్యాలీలో పాల్గొన్న బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు

పామిడి: పట్టణంలో సోమవారం భావసారక్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ 394 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటాన్ని అశ్వ, హంస వాహనంలో ఊరేగించారు. స్థానిక పెద్ద విఠోబదేవాలయం నుంచి గుత్తి బీసీసీ రోడ్డులోని ఛత్రపతి శివాజీ విగ్రహం వరకూ భారీగా ర్యాలీ చేపట్టారు. అక్కడ శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక భావసార క్షత్రియ భవన్‌లో వేడుకలు చేశారు. కార్యక్రమంలో భావసార క్షత్రియ సమాజ్ సభ్యులు శ్రీనివాసరావు. జోజోడే కుమార్, రాజశేఖర్‌రావు, ముకుందా, జగని రవి, మంజునాథ్‌రావు, రమణరావు, భవానీరావు తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను సోమవారం ఛత్రపతి శివాజీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం సాయంత్రం 4గంటలకు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యకరమంలో బీజేపీ నాయకులు సింగరి లక్ష్మీనారాయణ, గంగాధర్‌యాదవ్, వీహెచ్‌పీ నాయకులు రాధాకృష్ణ, శేషఫణి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతులకు కల్యాణం చేస్తున్న పండితులు

గార్లదిన్నె: స్థానిక శివాలయంలో సోమవారం శివ మాలధారులు శివపార్వతుల కల్యాణోత్సవం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. భక్తులు హాజరై శివ పార్వతులను దర్శించుకున్నారు. అనంతరం శివపార్వతుల విగ్రహాలను ఊరేగించారు. సాయంత్రం నూతనంగా తయారు చేయించిన శివలింగాన్ని గ్రామంలో ఊరేగించి ఆలయం వద్దకు చేర్చారు.

## లక్ష్మీనారాయణ స్వామి మహా విజయయాత్ర



లక్ష్మీనారాయణ స్వామి విగ్రహ ఊరేగింపు దృశ్యం



చెరువు నాగమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: పట్టణంలోని హనుమాన్ సర్కిల్ నుంచి మండలంలోని కసాపురం గ్రామం వరకూ సోమవారం లక్ష్మీనారాయణ స్వామి విగ్రహ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు మండలంలోని కసాపురం గ్రామంలో టీపీఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 22న విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన మహా విజయయాత్రను ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే తిమ్మాపురం గ్రామంలో చెరువు నాగమ్మ ఆలయం వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్‌కు స్థలమివ్వండి

- ఎమ్మెల్యేకు మేదర కులస్తుల వినతి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మేదర (మహేంద్ర) కులస్తులకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని మేదర సంఘం నాయకులు కోరారు. సోమవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలసి వినతిపత్రాన్ని అందజేశారు. స్థల కేటాయింపు ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను ఆ కులస్తులు సత్కరించారు. కార్యక్రమంలో మేదర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, శ్యామ్‌బాబు, నాయకులు మునయ్య, వీరన్న, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'హోదాపై కాంగ్రెస్ మొసలి కన్నీరు'

గుంతకల్లు: ఆంధ్రప్రదేశ్‌ను అడ్డుగోలుగా విభజించిన కాంగ్రెస్ ఇప్పుడు ప్రత్యేకహోదాపై మొసలి కన్నీరు కరుస్తుందని వైఎస్సార్ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి టీసీ నారాయణరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో వస్తే ప్రత్యేకహోదా తీసుకువస్తానని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ప్రకటించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ఆంధ్రప్రదేశ్‌ను అడ్డగోలుగా విభజించిన కాంగ్రెస్‌ను తరిమికొట్టాలన్నారు.

## ఓటు నమోదు చేయించుకోండి

బుక్కరాయసముద్రం: 18 సంత్సరాలు నిండిన యువత తప్పనిసరిగా ఓటు ఓటర్‌గా నమోదు చేయించు కోవాలని ఎంపీడీఓ శోభారాణి సూచించారు. సోమవారం మండలంలోని దయ్యాలకుంటపల్లిలో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఓటరు నమోదు నిరంతర పక్రియ అన్నారు. 18 సంత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఎప్పుడైనా ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. బూత్ లెవల్ అఫీసర్ వద్ద మీ ఓటు ను సరి చూసుకోవాలన్నారు. మద్యం, ప్రలోభాలకు లొంగకుండా నచ్చిన వ్యక్తిని ఎన్నుకునే హక్కు ఓటరుకు ఉందన్నారు. అనంతరం ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. ఎంపీటీసీ శివారెడ్డి, వ్యవసాయ అధికారి శ్యాం సుందర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు నిబంధనలు పాటించాలి

నార్పల: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించి సురక్షంగా గమ్యానికి చేరుకోవాలని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని క్రాసింగ్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్సులు లేని పలు వాహనదారులకు చలానాలు విధించారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు అతి వేగంగా వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. డైవర్లకు లైసెన్సులు తప్పక ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. ఏఎస్ఐ ఈశ్వరయ్య, జమీందార్ జయకుమార్, సిబ్బంది అనిల్, హరి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ట



యల్లనూరు: మండలంలోని చింతకాయ మంద గ్రామంలో సోమవారం చెన్నకేశవ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ధ్వజ స్తంభ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చనలు, అభిషేకాలు, ధ్వజ స్తంభ ప్రతిష్ట కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్ద కేశవ రెడ్డి, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

**నేడు రాతి దూలం లాగుడు పోటీలు:** చెన్న కేశవ స్వామి ఆలయ వార్షికోత్సం సందర్భంగా మంగళవారం ఉదయం రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

## సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి

గుత్తి రూరల్: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల్లో మెగా సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు డిగ్రీ కళాశాలల విద్యార్థులు నిరసన తెలిపారు. విద్యార్థినులు మాట్లాడుతూ ఎస్కేయూకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో 2015 సెమిస్టర్ పద్ధతి ప్రారంభమైన రోజు నుంచి ప్రస్తుత సప్లిమెంటరీ రాస్తున్న విద్యార్థులకు మెగా సప్లిమెంటరీ పరీక్ష నిర్వహించాలన్నారు. 4,600 మంది విద్యార్థులతో ఫీజు కట్టించుకుని పరీక్ష నిర్వహించలేదన్నారు. డిగ్రీలో ఒక సబ్జెక్టు తప్పిన వారు సుమారు 5వేల మంది ఉంటారన్నారు. వారిందరికీ అవకాశం కల్పించేలా మెగా సప్లిమెంటరీ పరీక్ష నిర్వహించి న్యాయం చేయాలని విద్యార్థినులు కోరారు. అనంతరం తహసీల్దార్ భారతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జిలాన్‌బాషా, దర్శన్, చరణ్, రాజేష్, ధన, పవన్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఘనంగా మాఘ మాస పూజలు



శివలింగానికి అభిషేకం చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని పురాతనమైన కాశీ విశ్వేశ్వర దేవాలయంలో మాఘ మాసం రెండో సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు రమణస్వామి ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు, కాగడ హారతి వంటి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.